క్లుప్తంగా

ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి


ఎల్‌కే తాండలో పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

గడివేముల: సొంత పొలం కలిగిన ప్రతి ఒక్కరూ విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలని ఏఓ హేమసుందర్‌రెడ్డి సూచించారు. గురువారం మండల పరిధిలోని ఎల్‌కే తాండ, గని గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. 11 అంకెల గుర్తింపు గల విశిష్ట సంఖ్య నమోదుతో రైతులకు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రాల్లో వెళ్లి ఆధార్ కార్డు, పొలం పాసుపుస్తకం, సెల్ నంబర్‌ను తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

పరామర్శ


అంజనమ్మను పరామర్శిస్తున్న ఆదిమూలపు సతీష్

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని గొందిపర్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ వార్డు మెంబర్ అంజనమ్మ ఇటీవల అనారోగ్యానికి గురై కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. గ్రామ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ గురువారం ఆస్పత్రికి వెళ్లి అంజనమ్మను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

స్వామివారికి ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: కల్లూరు అర్బన్ 35వ వార్డులోని నాగులకట్ట శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సమేత శ్రీ ఉమామహేశ్వర స్వామి వార్ల ఉత్సవ పల్లకీ ఊరేగింపు కార్యక్రమం గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని మొక్కుకున్నట్లు చెప్పారు.

ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మద్దిలేటి

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన దుర్గా భోగేశ్వరాలయం వద్ద భక్తుల సౌకర్యార్థం ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మద్దిలేటి తెలిపారు. చేశారు. మహాశివరాత్రి సందర్భంగా భోగేశ్వరాలయానికి వచ్చిన భక్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. సూపర్‌వైజర్ మనోహర్, ఏఎన్‌ఎం మౌలాబి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారితపై అవగాహన


మహిళా సాధికరత డ్రాయింగ్‌లను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో మహిళా సాధికారతపై విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం మాట్లాడుతూ.. విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని మహిళల సామర్థ్యం, సాధికారతపై చిత్రాలు రూపొందించారన్నారు. మహిళా సాధికారిత కో-ఆర్డినేటర్ నాగమణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. విద్యార్థినులు అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నతంగా రాణించాలన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీకి 61 మంది గైర్హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా గురువారం జరిగిన పరీక్షలకు 61 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 11 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా 519 మందికిగాను 458 మంది హాజరు కాగా 61 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు వెల్లడించారు.

కమనీయం.. భోగేశ్వరుని కల్యాణం

- కిటకిటలాడిన ఆలయం
- ఉదయం నుంచి రాత్రి వరకు నిర్విరామంగా స్వామివారి దర్శనం

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల వద్ద ఎర్రమల కొండల్లో వెలసిన శ్రీ దుర్గాభోగేశ్వరుని కల్యాణం గురువారం తెల్లవారుజామున వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ఆలయ సిబ్బంది పట్టు వస్త్రాలను సమర్పించారు. పురోహితుల మంత్రోచ్ఛరణ మధ్య నిర్వహించిన పార్వతీ, పరమేశ్వరుల కల్యాణం కమనీయంగా సాగింది. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను ఆలయ ప్రధానార్చకులు శ్యాంసుందర్ శర్మ అందించారు. కల్యాణ వేడుకల్లో ఆలయ ఈఓ రామానుజన్, సేవా కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

భోగేశ్వరాలయం అభివృద్ధికి కృషి

దుర్గా భోగేశ్వరాలయం అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి అన్నారు. ఆమె గురువారం స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆరు పళ్ల లోపు విభాగం వృషభాల రాష్ట్రస్థాయి పోటీలను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏటా మహాశివరాత్రి సందర్భంగా వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మాజీ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

భోగేశ్వరంలో భక్తుల సందడి

ఓం నమఃశివాయ.. హర హర మహాదేవ.. శంభో శంకర.. ఓం శ్రీ భోగేశ్వరస్వామికి జై.. అనే నామస్మరణతో భోగేశ్వర క్షేత్రం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన శ్రీ దుర్గాభోగేశ్వరాలయం మహాశివరాత్రి సందర్భంగా భక్తులతో కళకళలాడింది. రెండో రోజు గురువారం వందలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆలయ పరిధిలోని పంచకోనేర్లలో స్నానం ఆచరించారు. అభిషేక ప్రియుడైన ఈశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. అమ్మవారికి కుంకుమార్చన పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి ప్రారంభమైన స్వామివారి దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది. భోగేశ్వరున్ని దర్శించుకున్న భక్తులకు కాశిరెడ్డినాయన, ఆర్యవైశ్య సత్రాలలో భోజన సౌకర్యం కల్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ రామానుజన్, ఎస్‌ఐ నాగార్జునరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.


భోగేశ్వరుడి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు,


భోగేశ్వర స్వామికి అభిషేకం చేస్తున్న భక్తులు


భోగేశ్వరాలయం ప్రధాన కోనేరులో స్నానం చేస్తున్న భక్తులు


వృషభాల బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి

పాణికేశ్వర ఆలయంలో..



అలంకరణలో పాణికేశ్వర, నాగలింగేశ్వర స్వాములు, కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

పాణ్యం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం తెల్లవారుజామున పాణికేశ్వర స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈఓ సువర్ణ, పండితుల ఆధ్వర్యంలో కల్యాణం తంతు జరిగింది. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పండితులు వేదమంత్రాలతో కల్యాణం జరిపించారు. కల్యాణం తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు.

వైభవంగా నాగలింగేశ్వర స్వామి కల్యాణం

మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న నాలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ రామకృష్ణ మాట్లాడుతూ.. మహాశివరాత్రి జాగరణ పురస్కరించుకొని తెల్లవారుజామున స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించామన్నారు. అర్చకులు రవిస్వామి, అభిస్వామి, నాగేశ్వరయ్య ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కనులారా వీక్షించి తరించారు.

భీమేశ్వర స్వామికి..


మాణిక్యాంబా, భీమేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

కల్లూరు: మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా కల్లూరులోని మాణిక్యాంబా, భీమేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం గురువారం తెల్లవారుజామున ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. సాయంత్రం కల్లూరు వీధులలో స్వామివార్లకు నందికోల సేవ, పల్లకీ సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ నిర్వహణ అధికారి గుర్రెడ్డి, చంద్రశేఖరప్ప, పవన్‌కుమార్, ఆలయ అర్చకులు రాఘవేంద్ర, శేషసాయి, వీరేష్, వీరభద్ర స్వామి భజన మండలి సభ్యులు, భీమేశ్వర స్వామి భజన మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కాల్వ బుగ్గ క్షేత్రంలో..

ఓర్వకల్లు: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా కాల్వబుగ్గ దేవస్థానంలో గురువారం తెల్లవారుజామున భ్రమరాంబాదేవి, బుగ్గరామేశ్వరుని కల్యాణం కమనీయంగా సాగింది. ముందుగా గర్భగుడిలో ఆలయ అర్చకులు కళ్లె లక్ష్మినారాయణ శర్మ ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం, యమాభిషేకం పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు నూతన పట్టు వస్త్రాలు ధరింపచేసి, కల్యాణోత్సవానికి ముస్తాబు చేశారు. ఆది దంపతులను పల్లకీలో ఆశీనులు గావించి.. భాజా భజంత్రీల మధ్య కల్యాణ కట్ట వద్దకు చేర్చారు. అప్పటికే సిద్ధంగా ఉంచిన పీటలపై స్వామి, అమ్మవార్లను ఉంచి వేద పండితులు జంద్యాల ప్రసాద శర్మ మంత్రోచ్ఛరణల మధ్య స్వాముల వారి కల్యాణోత్సవం జరిపించారు. ఈఓ మద్దిలేటి దంపతులు స్వాముల వారి తరుపున, ఉత్సవ కమిటీ సభ్యులు కాటినేని నారాయణ దంపతులు అమ్మవారి తరపున పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు. గంట పాటు జరిగిన కల్యాణ తంతును భక్తులు కనులారా వీక్షించి, అక్షింతలు చల్లుతూ.. ఓం నమఃశివాయ, హరహర మహాదేవ.. శంభో శంకర అంటూ పరవశించిపోయారు. అనంతరం ఆది దంపతులను దర్శించుకొని తరించారు. తర్వాత స్వామివారిని ఆలయ గర్భగుడిలోకి తీసుకెళ్లారు.

కన్నమడకలలో..

మండలంలోని కన్నమడకల బుగ్గ క్షేత్రంలో గురువారం తెల్లవారుజామున పార్వతీ సమేత రామలింగేశ్వర స్వాముల వారి కల్యాణం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కల్యాణోత్సవంలో గ్రామ నాయకుడు సుధాకర్‌రావు దంపతులు కల్యాణ పెద్దలుగా వ్యవహరించారు. ఆలయ పురోహితులు చంద్రశేఖర్‌శర్మ స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. భక్తుల శివ నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి.


కన్నమడకలలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

చూసిన కనులదే భాగ్యం..


వర్కూరులో శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహిస్తున్న గ్రామస్తులు


సి.బెళగల్ గట్టు మల్లికార్జున, భ్రమరాంబాదేవిల కల్యాణ తంతు

కోడుమూరు రూరల్: మండలంలోని వర్కూరులో వెలసిన సిద్ధేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం లింగోద్భావ సమయాన గ్రామస్తులు శివపార్వతులకు అంగరంగ వైభవంగా కల్యాణాన్ని నిర్వహించారు. అంతకుముందు గ్రామస్తులు సంప్రదాయబద్ధంగా పుట్టమన్ను, తోరణాలు తెచ్చి పెండ్లి పందిరి వేసి స్వామి అమ్మవార్ల కల్యాణాన్ని నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం కల్యాణమూర్తులైన స్వామి అమ్మవార్లను పురవీధుల గుండా ఊరేగించగా, గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కనుల పండువగా మల్లికార్జున, భ్రమరాంబికల కల్యాణం

సి.బెళగల్: మండల కేంద్రంలో గురువారం మల్లికార్జున, భ్రమరాంబికా దేవిల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. కొండపై ఉన్న ఆలయం నుంచి దేవతామూర్తుల విగ్రహాలను కల్యాణ మండపానికి తీసుకువచ్చి పురోహితులు నరసింహాచారులు కల్యాణం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ దేవతా మూర్తులను మేళతాలలతో ఊరేగించారు. గట్టు మల్లికార్జున, మిట్ట సోమప్ప, అన్నప్ప స్వామి ఆలయాలతోపాటు పోలకల్, కొండాపురం, గుండ్రేవుల, ఇనగండ్ల, బురాన్‌దొడ్డి, మారందొడ్డి, కె.సింగవరం, ముడుమాల, సంగాల, కంబదహాల్ తదితర గ్రామాల్లోనూ శివరాత్రి ఉత్సవాలు ముగిశాయి.

అట్టహాసంగా బండలాగుడు పోటీలు


బండను లాగుతున్న ఎద్దులు

సి.బెళగల్: స్థానిక అన్నప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన రెండు పండ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు అట్టహాసంగా సాగాయి. ఐదు జతలు పోటీలో పాల్గొనగా కురువ ఈరన్న ఎద్దులు విజేతగా నిలిచి రూ.10 వేల నగదు బహుమతి దక్కించుకున్నాయి. ఎస్‌బీ నాగిరెడ్డి ఎద్దులు రెండవ, ఎం.ప్రవీణ్ ఎద్దులు మూడవ, మాధవస్వామి ఎద్దులు నాల్గవ, కోడిగుడ్ల వెంకటేష్ ఎద్దులు ఐదవ స్థానంలో నిలిచి వరుసగా రూ.రూ.7,500, రూ.5,000, రూ.3,000, రూ.2,500 నగదు బహుమతులు గెలుచుకున్నాయి.

రమణీయం..నాగలింగేశ్వర రథోత్సవం


చనుగొండ్లలో నాగలింగేశ్వరస్వామి రథోత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు

కోడుమూరు రూరల్: గూడూరు మండలం చనుగొండ్ల గ్రామంలో వెలసిన నాగలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం స్వామి వారి రథోత్సవాన్ని గ్రామస్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెలవారుజామున కేశవ నాగలింగేశ్వర స్వామివారి కల్యాణాన్ని, ప్రభోత్సవాలను వేదపండితులు కనుల పండువగా నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా ఎలాంటి ఘటనలు జరగకుండా గూడూరు పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

గూడూరులో.. : శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గూడూరులో వెలసిన నీలకంఠేశ్వర స్వామి రథోత్సవాన్ని గురువారం రాత్రి ప్రజలు ఘనంగా నిర్వహించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు గూడూరుతోపాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.


గూడూరులో నీలకంఠేశ్వరస్వామి రథోత్సవం

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచాలి


సాగుచేసిన ఆకుకూరలను పరిశీలిస్తున్న అధికారులు

ఓర్వకల్లు: ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని రాష్ట్రస్థాయి ప్రకృతి వ్యవసాయ అధికారి సురేష్‌బాబు సూచించారు. మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో గురువారం రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో కమ్యూనిటీ మేనేజ్ నేచురల్ ఫార్మింగ్ ద్వారా చేపట్టిన ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సురేష్‌బాబుతో పాటు, జిల్లా అధికారులు లక్ష్మయ్య, వంశీకృష్ణ సందర్శించారు. గ్రామానికి చెందిన ప్రకాశం అనే రైతు సాగుచేసిన ఆకుకూర తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ పద్ధతి ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందవచ్చన్నారు. రైతు ప్రకాశం 6 నుంచి 10 రకాల ఆకుకూరలను సహజ పద్ధతిలో పండించడంతో ఆయన్ను అభినందించారు. అనంతరం రాష్ట్ర అధికారి సురేష్‌బాబు ప్రకృతి వ్యవసాయ విధానం ఉపయోగాలను వివరించారు. ఎంటీ వెంకటరమణ, మోడల్ మేకర్ మహేష్, ఎల్-2 సామేశ్వరమ్మ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు


రాతి దూలాన్ని లాగుతున్న వృషభాలు

ఓర్వకల్లు: మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో గురువారం నిర్వహించిన అంతర్రాష్ట్ర వృషభాల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. మహాశివరాత్రి పండుగ సందర్భంగా బుగ్గరామేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో జరిగిన న్యూకేటగిరీ వృషభాల పోటీల్లో మొత్తం 9 ఎడ్ల జతలు పాల్గొన్నట్లు రైతు సంఘం నాయకులు తెలిపారు. ఇందులో ప్యాపిలి మండలం, డి.రంగాపురానికి చెందిన జూటూరు రామకృష్ణారెడ్డి, నంద్యాల మండలం, మల్యాలకు చెందిన షేక్ హైమున్న (ఉభయ జత) వృషభాలు నిర్ణీత సమయంలో రాతి దూళాన్ని 3398 అడుగుల దూరం లాగి మొదటి బహుమతి రూ.60 వేలు గెలుపొందాయి. తర్వాతి స్థానాల్లో నిలిచిన వైఎస్సార్ జిల్లా, బాలయ్యగారిపల్లె విష్ణువర్ధన్ రెడ్డి వృషభాలు (3102 అడుగులు) రూ.40 వేలు, గద్వాల జిల్లా, ఇటిక్యాల మండలం, శనగపల్లె చక్రవర్తి గౌడు, కర్నూలు మండలం, రేమట నడిపి గట్టయ్య ఉభయ జత వృషభాలు (3071 అడుగులు) రూ.30 వేలు, అలంపూరు మండలం, కంచుపాడు విశ్వనాథ్‌రెడ్డి, గోనెగండ్ల మండలం, హెచ్.కైరవాడి లక్ష్మన్న ఉభయ జత వృషభాలు (3048 అడుగులు) రూ.20 వేలు గెలుపొందాయి. అలాగే లక్ష్మంపల్లెకి చెందిన గుంటూరు శివారెడ్డి, పి.రుద్రవరం ఎల్లగౌడు ఉభయ జత వృషభాలు (2704 అడుగులు) రూ.10 వేలు, జూటూరు రామకృష్ణారెడ్డి, దేవేంద్రారెడ్డి ఉభయ జత వృషభాలు (2700 అడుగులు)రూ.8 వేలు గెలుచుకున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

దోమలు పెరగకుండా చూసుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): ప్రజలు వారానికి ఒకసారి శుక్రవారం ఫ్రైడే - డ్రైడే పాటించాలని, డెంగీ వ్యాప్తి చేసే ఈడిస్ దోమల సంతతి పెరగకుండా చూసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ గురువారం ఒక ప్రకటన ద్వారా సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా శుభ్రంగా ఉంచుకోవాలని, ఇంట్లో వాడుకోవడానికి నీటిని నిల్వ చేసే డ్రమ్ములు, సిమెంట్ తొట్టెలు, ట్యాంకులు, పూలకుండీలు, ఫ్రిడ్జ్ తదితర వాటిని వారానికోసారి శుభ్రం చేసుకోవాలన్నారు. జ్వరంతో బాధపడుతున్న వారు పట్టణ/ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు/విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో రక్త పరీక్షలు చేయించుకుని అవసరమైన చికిత్స తీసుకోవాలని సూచించారు. పెద్దకడబూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నౌలేకల్లు గ్రామంలో పూర్తిస్థాయి వైద్యం అందించి బాధితులు కోలుకునేలా కృషి చేయాలన్నారు. వైద్య సిబ్బందిచే ఇంటింటి సర్వే నిర్వహించాలని, అవసరమైన వారికి వైద్యం అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

వాడీవేడిగా గూడూరు నగర పంచాయతీ సమావేశం

- కుళాయి నీటి పన్ను పెంపునకు పాలకవర్గ నిరాకరణ
- పనులు చేయని కాంట్రాక్టర్లపై చర్యలకు సభ్యుల డిమాండ్



మున్సిపల్ కమిషనర్‌ను ప్రశ్నిస్తున్న వైస్ చైర్మన్ పీఎస్ అస్లామ్

కోడుమూరు రూరల్: గూడూరు నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన కమిషనర్ రమేష్‌బాబు గురువారం నిర్వహించిన నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా సాగింది. వైస్‌చైర్మన్ పీఎస్ అస్లామ్ మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నగర పంచాయతీ అభివృద్ధి కోసం రూ.11.50 కోట్ల నిధులు మంజూరైతే, అందులో రూ.7.50 కోట్లను మాత్రమే ఖర్చు చేయగా, రూ.4కోట్లు మిగిలాయని, 2021లోనూ రూ.3 కోట్ల పనులకు ప్రతిపాదనలు పంపినా కాంట్రాక్టర్లు, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వల్ల పనులు జరగలేదని తెలిపారు. పనులు చేయని కాంట్రాక్టర్లు, ఇంజినీర్లపై మున్సిపల్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. పనులు సక్రమంగా చేయని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో పెట్టడంతో పాటు, పనుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఇంజినీర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగర పంచాయతీ పరిధిలో నీటి పన్ను పెంచే అంశాన్ని కమిషనర్ ప్రతిపాదించగా, వైస్ చైర్మన్లు పీఎస్ అస్లామ్, లక్ష్మన్నతోపాటు, పాలకవర్గ సభ్యులు నిరాకరించారు. పట్టణంలో నీటి సరఫరా సక్రమంగా లేదని, అక్రమ కుళాయి కనెక్షన్లను గుర్తించి వారి నుంచి డిపాజిట్లు, పన్ను వసూలు చేస్తే సరిపోతుందని, కొత్తగా పన్ను విధించాల్సిన అవసరం లేదని పాలకవర్గ సభ్యులు తీర్మానించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు తీవ్రమవుతుందని, ఏ రోడ్డు చూసినా వాహనాల రద్దీతో ఉంటోందని, రోడ్డు వెడల్పుతో పాటు, ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు రత్నమ్మ, దస్తగిరి, కోఆప్షన్ సభ్యులు రామాంజనేయులు డిమాండ్ చేశారు. అక్రమంగా వేసిన వెంచర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నగర పంచాయతీ అభివృద్ధికి అధికారులు, కౌన్సిలర్లు కలిసికట్టుగా కృషి చేయాలని, సభ దృష్టికి కౌన్సిలర్లు తెచ్చిన సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కమిషనర్ రమేష్‌బాబు మాట్లాడుతూ గూడూరు నగర పంచాయతీ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని, పాలకవర్గ సభ్యులు సహకరించాలని కోరారు. తహసీల్దార్ రామాంజనేయులు, కౌన్సిలర్లు సురేష్, ఖలీల్, కలామ్, మద్దిలేటి, షేషావలి, మదార్‌బాషా పాల్గొన్నారు.

వాటర్ షెడ్ పనుల్లో పురోగతి సాధించండి


వాటర్ షెడ్ కమిటీ చైర్మన్లను అభినందిస్తున్న పీడీ వెంకటరమణ

ఓర్వకల్లు: వాటర్ షెడ్ పనుల్లో పురోగతి సాధించాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణ సూచించారు. మండలంలోని హుసేనాపురం గ్రామంలో గురువారం వివిధ గ్రామాల వాటర్ షెడ్ కమిటీ సభ్యులకు అవగాహన కల్పించారు. అదనపు పీడీలు మాధవీలత, కృష్ణమోహన్, ఏపీడీ లక్ష్మన్న, జేఈ అయూబ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, భూమిని సంరక్షించాలన్నారు. ప్రవహించే నీటిని నిలిచేలా చేయడం, నిలిచిన నీటిని భూమిలోకి ఇంకింపజేయడమే వాటర్ షెడ్ పథకం ఉద్దేశమని వివరించారు. ప్రతిఒక్కరూ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ఇంకుడు గుంతలు, ఫారం పాండ్స్ తవ్వించుకోవాలని సూచించారు. ఈ పథకం కింద శకునాల, తిప్పాయపల్లె, బ్రాహ్మణపల్లె, ఓర్వకల్లు, కాల్వ, హుసేనాపురం గ్రామాలను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఆయా గ్రామాల్లో వాటర్ షెడ్ ద్వారా నేల ఉపరితలాన్ని బట్టి చెక్‌డ్యాంలను నిర్మించడం, గుంతలు తవ్వడం చేపట్టాలన్నారు. అనంతరం వాటర్‌షెడ్ కమిటీ చైర్మన్లకు జ్ఞాపిక అందజేసి, ప్రశంసా పత్రాలతో అభినందించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏపీడీ లక్ష్మన్న, ఏపీఓ కుమార్ సాయినాథ్, జేఈ అయూబ్‌బాషా, వాటర్ షెడ్ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.